# పతివ్రత

దేవస్

సిగరెట్టు వాసన.

నిజమేనా?

తను లేనప్పుడు తన ఇంటిలోకి పరాయి మగవాడు వస్తున్నాడా?

దిక్కుతోచటం లేదు మూర్తికి; తలుచుకున్న కొద్దీ మతిపోతోంది.

నిర్మల తనను దగా చేస్తోందా? ఎలా నమ్మటం? ఎలా నమ్మక పోవటం? అడిగితే చెబుతుందా? గద్దిస్తే బయట పడుతుందా?

కొత్తకాపురం పెట్టి ఆర్నెల్లు గడిచాయి అంతే, ఎంత ప్రేమగా చూసుకుంటున్నాడు నిర్మలని! ఏం తక్కువయింది ఆమెకు? కొంపదీసి, పాత ప్రియుడెవడైనా ఉన్నాడా? పెళ్ళయినా వదిలి పెట్టక, ఇప్పుడు సరాసరి ఇంటికే వస్తున్నాడా?

ఊరవతల ఇంటిలో కొత్త కాపురం మొదలెట్టి నప్పుడు అనుమానాలు రానే వచ్చాయి, అయితే ఇటువంటి సందేహాలు కాదు.

ఇంటికి భద్రత ఉండదేమో ననుకున్నాడు, తను ఆఫీసుకి వచ్చెయ్యగానే నిర్మల ఇంట్లో ఒక్కత్తీ బితుకు బితుకుమని గడపాల్సి వస్తుంది కదా అని దిగులు పడ్డాడు, ఇల్లు దూరంగా ఉండటం ఆమెకు అన్నిందాలా ఇబ్బంది అనుకున్నాడు, అయితే ఈ కారణంగానే ఆమె ప్రియుణ్ని కలుసుకోవటం మరింత సులువయిందా? తను ప్రొద్దున్న తొమ్మిదింటికి ఇంటి నుంచి బయలుదేరి ఆఫీసుకి వచ్చేస్తాడు. వస్తూ బాక్సులో భోజనం తెచ్చుకుంటాడు. మళ్ళీ బస్సులు మారి ఇల్లు చేరే సరికి ఆరున్నరవుతుంది. ఇటీవల మరికాస్త ఆలస్యం కూడా అవుతోంది.

ఉద్యోగం కూడా కొత్తదే కాబట్టి కొత్త స్నేహితులు దొరికారు, కొత్త పరిచయాలు కలిగాయి. ఆఫీసు తర్వాత మిత్రులతో కాస్సేపు గడపటం తప్పనిసరి అవుతోంది. అడపాదడపా పార్టీలు తప్పటం లేదు. ఐదారు సార్లు 'మందు' పార్టీలు కూడా అయ్యాయి, అప్పుడు మరీ రాత్రయ్యాక కాని ఇంటికి వెళ్ళలేక పోయాడు.

తనిలా ఆలస్యంగా ఇల్లు చేరుకోవటం నిర్మలకు మరింత అనువుగా దొరికిందేమో!

పాత ప్రియుడంటూ లేకుంటే కొత్తగా అయినా ఎవరో తారసపడి ఉండాలి.

ఎక్కడివాడు? ఇంటి చుట్టు ప్రక్కల వాడేనా? పగలంతా నిర్మల ఇంట్లో ఒంటరిగా ఉండటం పసిగట్టి నెమ్మదిగా 'వల' విసిరాడా? గుట్టు చప్పుడు కాకుండా సజావుగా ఇంట్లోనే జరిగిపోతోందా?

ఈ ఊళ్ళో ఇక తనకు బంధువు లెవరూ లేరు. ఆమెకు తెలిసిన వాళ్ళెవరూ కూడా లేరిక్కడ, మరి, తనకు తెలియకుండా ఇంటికి వచ్చేదెవరు? లేక, ఇదంతా వట్టి భ్రమేనా?

భ్రమ అయితే ఎంత బాగుండును!

నిర్మల నిజంగా నిర్మల అయితే....

సిగరెట్టు వాసన – ఎలా వచ్చింది? భ్రమకాదు.

తను సిగరెట్లు కాల్చడు. చిన్నప్పట్నుంచి ఆ వాసన అంటే పడదు. చాలా మంది మిత్రులు సిగరెట్లు కాలుస్తారు.

తనకు మాత్రం అది అలవాటు కాలేదు.

–సిగరెట్లు కాల్చే మొగాళ్ళంటే ఆడాళ్ళు తెగ ఇష్టపడతారోయ్, అనేవాడొక మిత్రుడు, నిజమేనా?

సిగరెట్లు కాల్చటం చూసి ముచ్చటపడి,

ఒక అపరిచిత వ్యక్తితో స్నేహం చేసిందా నిర్మల?

ఎంత ధైర్యం! ద్రోహం! దగా!

ఇదంతా తన భ్రమే అయితే...

నిన్న రాత్రి సిగరెట్టు వాసన అబద్ధమై ఉండాలి. పది దాటాక వెళ్ళాడు ఇంటికి, మందు పార్టీ నుంచి అతి నీరసంగా మత్తులోనే తిరిగి వచ్చాడు. –ఇప్పటికే ఆలస్యమైంది, రండి భోంచేద్దురుగాని, అని నిర్మల అంది గాని, వెంటనే తినాలనిపించలేదు. వడ్డిస్తూండు, వచ్చేస్తాను అంటూ బెడ్ రూంలోకి నడిచి మంచం మీద వాలిపోయాడు, కళ్ళు తిరిగినట్లయింది, ఏమిటో వింతగా అనిపించింది. కొత్త వాసన తెలిసింది. మొదట అనుమానం కూడా రాలేదు. ఆ తర్వాత ముక్కు ముడిచి పీల్చి చూశాడు. సిగరెట్టు వాసన.

సిగరెట్టు పీకగాని, బూడిదకాని కన్పిస్తుందేమో నని మంచం చుట్టు ప్రక్కల చూశాడు. ఏమీ లేదు. గదంతా పరిశీలించాడు. అంతా మామూలుగానే ఉంది. అంతలో నిర్మల వచ్చి భోజనానికి రమ్మంటూ చేయి పుచ్చుకోవటంతో అనుమాన పిశాచాన్ని లోలోపలే జోకొట్టాడు.

ఇంటికెవరైనా వచ్చినట్లు నిర్మల చెబుతుందేమో నని భోంచేస్తున్నంత సేపూ ఎదురు చూశాడు. ఆ ప్రసక్తే లేదు. మళ్ళీ పడగ్గది చేరాక నిద్రొస్తోందని తను కళ్ళు మూసుకున్నాడు. ఆమె లైటార్పి వచ్చి ప్రక్కన పడుకుంది. అప్పటికి సిగరెట్టు వాసన మటుమాయమైంది. కొంపదీసి, అది తన భ్రమేనేమోనని అనుమానం కగిలింది, ఎటూ నిర్ధారణ కాలేదు. మసక వెలుగులో నిర్మల ముఖం వైపు చూడగా, ముఖం నిర్మలంగానే ఉంది. మనసులో ఏముందో? ఆడదాని మనసు అగాధమన్నారు. నిర్మల కూడా ఆడదే.

మామూలుగానే తెల్లారింది, నిర్మల మామూలు గానే ఉంది, టిఫిన్, కాఫీ, భోజనం బాక్సు– అన్నీ మామూలే.

తన మనసు మాత్రం మామూలుగా లేదు.

ఇదేదో తేలేవరకు తనకేదీ మామూలుగా ఉండదు.....

★ ★ ★ ★ ★ ★ ★

ఆరోజు సాయంత్రం నాలుగున్నరకి తలనొప్పిగా ఉందని 'హెడ్'తో చెప్పి, వెంటనే ఇంటికి బైలు దేరాడు మూర్తి. రెండు బస్సులు మారి ఐదున్నరకల్లా ఇల్లు చేరుకున్నాడు. ఇల్లు దగ్గర పడుతుండగా గుండె శబ్దం చెవుల్లో వినిపించింది, ఇంట్లో నిర్మల ఒక్కతే ఉండాలని మనసారా కోరుకున్నాడు.

తలుపు తట్టిన వెంటనే గుమ్మంలో ప్రత్యక్షమైంది నిర్మల, నమ్మలేనట్లు చూసింది.

ప్రియుడి బదులు తను వచ్చాడని నిరాశ పడిందా? ఆమె ముఖంలో విచ్చుకున్న నవ్వు వెనుక 'కుట్ర' ఉందా? ఎలా తెలుస్తుంది?

–ఇవాళింత తొందరగా వచ్చేశారేమండీ? అంది.

–ఏం? రాకూడదా? నీకేమైనా అభ్యంతరమా?, అందామనుకున్నాడు, అనలేదు,

–తలనొప్పి, అంటూ పడగ్గది లోకి వెళ్ళాడు.

వెళ్తూనే వాసన చూశాడు. లేదు, సిగరెట్ వాసన లేదు.

మనసుతేలిక పడింది. అంతలో గుబులెక్కింది.

ప్రియుడు రాలేదేమో! వచ్చినా సిగరెట్టు కాల్చలేదేమో! – ఎలా తెలుస్తుంది?

వెనకే వచ్చిన నిర్మల, అమృతాంజనం తీసి రాయబోయింది. అక్కర్లేదంటూ తప్పించు కున్నాడు. –కాఫీ అయినా చేస్తాను, అంటూ ఆమె వంటింటిలోకి వెళ్ళగానే, చప్పున లేచి, యధాలాపం గానే ఇల్లంతా కలియదిరిగాడు. సిగరెట్ వాసన ఎక్కడా రాలేదు. నేలంతా చూపులతో గాలించాడు. కాంపౌండ్ దాకా కూడా చూశాడు. ఎక్కడా సిగరెట్టు పీక లేదు. ప్రియుడు ఇవాళ రాలేదు. అంతేనా?

నిన్నటి వాసన కేవలం భ్రమేనా?

తాగుడు మైకంలో మనసు రక రకాలుగా పని చేస్తుందంటారు. అయితే, మనసు వాసనల్ని కూడా కల్పిస్తుందా?

★ ★ ★ ★ ★ ★

అనుమానం పెనుభూతం. అంత తొందరగా వదులుతుందా? దీని అంతేదో కనుక్కోవాలను కున్నాడు మూర్తి.

నిర్మల కొక ప్రియుడు ఉండే మాట నిజమైతే, తన

ఇంట్లోనే రంకు సాగుతుంటే, ఆ సంగతి నిర్ధారణ అయితే – ఏం చెయ్యాలి?

అది మాత్రం ఊహించలేక పోతున్నాడు మూర్తి.

ఏమైనా చెయ్యొచ్చు. ఏమైనా చేస్తాడు.

ముందిది తేలాలి. అటో ఇటో తేలిపోవాలి.

మరుసటి రోజు ఆఫీసుముగిసిన వెంటనే ఇంటికి వచ్చాడు. ఏమీ తేల లేదు. వాసన లేదు.

తనకు అనుమానం వచ్చిందని గాని నిర్మల పసిగట్టిందా? ప్రియుణ్ని ఇంటికి రావద్దని చెప్పిందా? ఇద్దరూ మరెక్కడైనా కలుసుకుంటు న్నారా? పగలంతా తను ఒక్కత్తే ఉంటుంది. సాయంత్రం లోపు ఎక్కడికి వెళ్ళి వచ్చినా అడిగే వాళ్ళు లేరు.

తనకు అనుమానం వచ్చినట్లు ఆమెకు అనుమానం రాకూడదు. తెలివిగా ఆరాతియాలి.

రంకు నేర్చిన ఆడది బొంక నేర్వదా?

ఆడది అబద్ధ మాడితే గోడకట్టినట్లు.

అడిగి లాభం లేదు.

కనిపెట్టి నిలదీయటమే మార్గం.

కనిపెట్టడానికి ఏది మార్గం?

తను ఆఫీసు కెళ్ళినప్పుడు ఇంటిపై నిఘా వేయమని ఎవర్నయినా ఏర్పాటు చేస్తే? పరువు పోతుంది. విదేశాల్లో అయితే ఇటువంటి పనుల్ని ప్రయివేటు డిటెక్టివ్‌లకి అప్పగిస్తారు. ఛ – ఇండియా ఇంకా వెనకబడే ఉంది.

అనుమానం అనుమానంగా ఉండగానే. పైకి అంతా మామూలుగా ప్రవర్తిస్తున్నాడు మూర్తి.

తెలివినంతా ఉపయోగించి నిర్మలను జాగ్రత్తగా, స్టడీ చేస్తున్నాడు. ఆమె మాటలో గాని, నవ్వులో గాని, ప్రవర్తనలో గాని, మార్పు ఉందా?

ఒకప్పుడు నిర్మల తనకు తెలిసిన నిర్మలే కాదనిపిస్తుంది. మరొకప్పుడు. ఎప్పటి నిర్మలే – వట్టి అమాయకురాలని పిస్తుంది.

ఎలా ఈ ఆడవాళ్ళని అర్థం చేసుకోవటం? నమ్మట మనేది మరి మరి కష్టం!

ఆమెకు అనుమానం రాకుండా, రెండు మూడు రోజులు ఆఫీసు నుంచి సరాసరి మామూలు వేళకె వచ్చాడు. సిగరెట్టు వాసన లేదు. ఒకరోజు కొంచెం లేటుగా వచ్చాడు. వాసన లేదు.

అంతా వట్టి భ్రమే నని పించింది మూర్తికి మళ్ళీ.


ఆం జా తాగిన మైకంలో తనకూ అనిపించింది. అని నిర్ధారణ చేసుకో బోతుండగా–

చల్లారి పోతున్న తుపాను మళ్ళీ చెలరేగింది. పడగ్గదిలో మళ్ళీ వచ్చింది –సిగరెట్టు వాసన. అదే వాసన– నిర్మలను పీకనులిమి చంపెయ్యాలన్నంత కోపం ముంచుకు వచ్చింది.

అనుమానం బలపడుతోందే గాని, ఆధారం దొరకలేదు.

ఎంత కాలం ఈ దొబూచులాట?

రాత్రిళ్ళూ నిద్రపట్టదు మూర్తికి. ప్రక్కనే నిర్మల



# పతివ్రత

ఎంత హాయిగా నిద్రపోతోంది! ఎంత గుండె నిబ్బరం! 'అంగన నమ్మరాదు', అని ఊరికే అన్నారా?

డిటెక్టివ్ పుస్తకాలు చదివిన తెలివినంతా ఉపయోగించాడు మూర్తి.

ఒక సాయంత్రం నిర్మలను సినిమాకు తీసుకెళ్ళాడు. ఇంట్లో నాలుగు గోడల మధ్య కాక, బయట ప్రపంచంలో ఆమె ప్రవర్తన ఎలా ఉంటుందా అని పదేపదే నిశితంగా పరిశీలించాడు. మార్పు లేదు. మరోసారి మార్కెట్‌కు వెళ్ళినప్పుడు కులాసాగా కబుర్లు చెబుతూ 'సెక్స్' ప్రస్తావన తెచ్చాడు.

అలవాటైన ధోరణిలోనే దీని గురించి కూడా ఫ్రీగా మాట్లాడిందే తప్ప, నిర్మలలో ఏమార్పూ లేదు. లేక, మార్పు కనిపించ నివ్వకుండా జాగ్రత్త పడుతోందా? ఆమెకు అంత నటన చాతనౌనా?

★ ★ ★ ★ ★ ★ ★

ఆఫీసులో మిత్రులు ఎద్దేవా చేస్తున్నారు. ఇంత 'ఇంటి పిల్లి' అయిపోయావేమిట్రా ? అంటున్నారు. ఆఫీసు తర్వాత కాఫీ టీలకి వెళ్ళటం లేదు. మందు పార్టీలని కూడా తిరస్కరించేస్తున్నాడు.

ఒకరోజు మామూలుగా ఆఫీసుకి వెళ్ళాడు. వెళ్ళి వెళ్ళగానే మామంచి అయిడియా వచ్చింది. వెంటనే ఆరోజుకి లీవ్ లెటర్ ఇచ్చేసి, మళ్ళీ ఇంటిదారి పట్టాడు.

ఇల్లు తాళం వేసి ఉంటుందనుకున్నాడు. లేదా ఇంట్లోంచి మగగొంతు వినిపిస్తుందనుకున్నాడు. రెండూ జరగలేదు. నిర్మల ఒక్కత్తే ఇంట్లో ఉంది. ఇంటిపనితో అలసి , బద్ధకంగా పడుకుంది. సిగరెట్ వాసన లేదు.

–ఏమైందండీ? వొంట్లో బాగులేదా?, అంది నిర్మల ఆందోళనగా.

–లేదు అదేమిటో ఇవాళ ఆఫీసు పని చెయ్యాలని పించలేదు. నీతో ఉండాలనిపించింది, అన్నాడు ఆ క్షణం నిర్మలమీద చెప్పరాని ప్రేమ పొర్లుకొచ్చింది.

–మంచిపని చేశారు, అంటూ కౌగిలించుకుంది.

* * *

ఆరోజు సాయంత్రందాకా పడగ్గది వదల్లేదు ఇద్దరూ. ప్రియుడు వచ్చి తలుపు తడతాడేమోనని చెవులు రిక్కించి జాగ్రత్తగా వింటున్నాడు మూర్తి ఎవరూ రాలేదు. ఇవాళ ప్రియుడు రాడని నిర్మలకు తెలుసా? రాకపోకలకు ఏదైనా సంకేతం ఉందేమో! తలుపుసగం తీయటం, కిటికీ పూర్తిగా మూయటం ... లాంటివి...

ఆ రోజంతా చాలా సంతోషంగా ఉంది నిర్మల. తనని వెర్రివెధవనుచేసి లోలోపల నవ్వు కుంటోందా? అయితే ఆ నవ్వులో కల్తీ కనిపించలేదు. తనమీద ప్రేమ మాత్రం నటన అనిపించలేదు. ఆ రాత్రంతా కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. జీవితమంతా ఇంత హాయిగా గడుస్తుందా అనికూడా అనిపించింది అప్పుడప్పుడూ, తెల్లవారుతుండగా అతనికి బోలెడంత దిగులనిపించింది. అనుమానం నిజమైతే నిర్మలను ఏంచెయ్యాలి? వదిలెయ్యాలా?, విడాకు లివ్వాలా? చంపెయ్యాలా? దిగులంతా తనకేనా? ప్రియుణ్ణి ఇంటికి రప్పించుకుంటూ కూడా తనతో ఇంత హాయిగా ఉందే – నిర్మల ఆడదేనా? దేవతా? రాక్షసా?

* * * *

అనుమానాన్ని కాస్త నిర్మల ముందే బయట పెట్టాలని బలంగా అనిపించింది. అయినా బలవంతాన నిగ్రహించుకున్నాడు. ఎలాగో గాని, ఇది తొందరగానే పరిష్కార మవుతుందని అతనికి ఎందుకో అనిపించింది. ఇదివరకటి ధోరణివేరు. ఇప్పుడామె ప్రేమమైకం మరి తలకెక్కింది. ఆ ప్రేమలో కల్తీ నిజమే అయితే భరించలేడు. చంపేస్తాడా? చంపెయ్యచ్చు. ప్రేమలో స్వార్థం అదే. పెళ్ళిలో నీతిని అవతల పెట్టినా, ఆమె ప్రేమను మరొకరికి పంచటానికి వీలులేదు. సహించలేడు. ప్రపంచాన్ని తన్ని తగలేస్తాడు. ఆమెను చంపేసి, తనూ చచ్చిపోతాడు. ఏమైనా చేస్తాడు.

నాలుగైదు రోజులు గడిచాక, ఒక మధ్యాహ్నం దాటినవేళ 'పర్మిషన్ తీసుకుని ఆఫీసునుండి బైట పడ్డాడు మూర్తి. సరాసరి బస్సెక్కి ఇంటికి వచ్చేశాడు.

ఏదో జరగబోతున్నట్లు ఎవరో హెచ్చరించి నట్లయింది. అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటి గుమ్మం దగ్గరకు వచ్చాడు. లోపల గడియ వేసుంది. తలుపు తట్టకుండా అలాగే నిలబడ్డాడు. వెంటిలేటర్ నుండి శబ్దాలు వస్తాయి కదా? విన్నాడు. లోపల నిశ్శబ్దం. అంతలో ముక్కుపుటాలు అదిరాయి. వాసన. సిగరెట్ వాసన! అదే వాసన!

అప్రయత్నంగా బిగుసుకున్నాయి మూర్తి పిడికిళ్ళు. నిలువెల్లా వణికాడు. పిడికిలితో తలుపుమీద కొట్టబోయి, ఆగాడు, తలుపులు తన్నాలనుకున్నాడు, బలవంతాన నిగ్రహించు కున్నాడు.

ఒక యుగమనిపించేంతసేపు, దాదాపు ఒక్క నిమిషం, అలాగే నిలబడ్డాడు. ఆ తర్వాత చప్పుడు చేయకుండా అడుగులో అడుగు వేసుకుంటూ ప్రహరి లోపలే, ఇంటిప్రక్కగా నడిచాడు. మరి జాగ్రత్తగా, పిల్లిలా అడుగులువేసి ముందుకు వెళ్ళాడు. బెడ్‌రూంకు కిటికీ ఉంది.

ఆ కిటికీగుండా ఇప్పుడు స్పష్టంగా వస్తోంది సిగరెట్ వాసన, గుండెను అక్షరాలా రాయి చేసుకున్నాడు మూర్తి.

ప్రపంచంలో ఏ భర్త చూడరాని దృశ్యం చూడబోతున్నాడు. పరాయి మగాడి చేతిలో తన ప్రియభార్యను చూడబోతున్నాడు. ఎంత సాహసం ఇది!

ఒక్కడుగు ముందుకువేసి కిటికీలోంచి చూసి...

నివ్వెరపోయాడు మూర్తి. అదేం దృశ్యమో అర్థం కానట్లు అలా చూస్తు ఉండిపోయాడు

మంచంపై బోర్లాపడుకుని తమాషాగా కాలు వూపుతోంది నిర్మల ఆమె ప్రక్కనే స్టూలుమీద, స్టూలు అంచున కాలుతున్న సిగరెట్టు ఉంది.

సిగరెట్ పొగకేసి తన్మయంగా చూస్తూ, నవ్వుతోంది, నవ్వుకుంటోంది నిర్మల.

బెడ్‌రూంలో మరో మనిషి జాడలేదు. అలికిడేలేదు.

మూర్తి రాకవల్ల కిటికీగుండా వెలుతురు మసకనీడగా కదిలింది కాబోలు, యథాలాపంగా తలతిప్పి కిటికీవైపు చూసింది నిర్మల.

ఆమె కళ్ళు చక్రాల్లా విచ్చుకున్నాయి ఏం చెయ్యాలో తోచని దానిలా తడబడింది. ఆ వెంటనే పకపకనవ్వేసింది.

ఒక్క ఉదుటున ఇంటిగుమ్మం వైపు పరుగెత్తాడు మూర్తి. ఆసరికే ఆమె తలుపు తీసింది. ఉద్వేగంతో ఆమె వణికిపోతోంది. నలిపి చంపేసేంత గట్టిగా కౌగిలించుకున్నాడు. – ఎందుకు? ఎందుకు? ఎందుకిలా?....., అన్నాడు. అంతే అనగలిగాడు.

చాలాసేపు ఆమెకు ఊపిరే ఆడలేదు. ఆపైన గొంతు . పూడుకుపోయింది. మాటలే ఏడుపులా కరిగిపోయేట్లుంది.

–ఎందుకు నిర్మలా? అన్నాడు మూర్తి.

–మీరు, రోజూ లేటుగా వస్తున్నారని, తాగుడులో పడి నన్ను కూడా మరిచిపోతున్నారని... అందుకే... మీకు ఎలాగైనా అనుమానం పుట్టిస్తే అయినా... మీరు ఇంటిదగ్గరే... నాదగ్గరే ఉంటారని... □

